సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 21 । నవంబర్ । 2023



పెరిగిన 'ఉపాధి' రికవరీలు

గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది.



ఓటు హక్కుపై ప్రచారం

విజయనగరం అర్బన్: ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రచారోద్యమాన్ని కలెక్టర్ కార్యాలయంలో జేసీ మయూర్ అశోక్ సోమవారం ప్రారంభించారు. ప్రచార పోస్టర్‌పై సంతకం చేశారు.

వెబ్‌సైట్‌లో ఉపకారవేతన పరీక్ష హాల్‌టికెట్స్

పార్వతీపురం టౌన్: వచ్చేనెల 3వ తేదీన జరగనున్న జాతీయ ఉపకార వేతన పరీక్షకు హాల్‌టికెట్లు 'బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. పాఠశాల హెచ్ఎంలు పాఠశాల యూడీఐఎస్ కోడ్‌తో లాగిన్ అయ్యి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని కోరారు.

న్యూస్‌రీల్

నేడు అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం

పార్వతీపురం: అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖాధికారి వి. తిరుపతయ్య తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరులో రూ.50లక్షలు విలువ చేసే ఫిష్‌ల్యాండ్ యూనిట్, గుమ్మలక్ష్మీపురంలో రూ. 20లక్షల యూనిట్, కురుపాం, సీతానగరంలలో రూ.10లక్షలు విలువ చేసే యూనిట్లు, రూ.75వేలు విలువ చేసే యూనిట్లు 9, రూ.20లక్షలు విలువ చేసే నాలుగు వాహనాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రూ.2.70 లక్షల విలువచేసే 1.60 లక్షల చేప పిల్లలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

జిల్లా కన్సల్టెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: వైద్య, ఆరోగ్యశాఖలో క్వాలిటీ మోనటరింగ్ విభాగంలో జిల్లా కన్సల్టెంట్ పోస్టును కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిపై భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. దరఖాస్తు నమూనా, అర్హతల వివరాలు హెచ్‌టీటీపీఎస్ పార్వతీపురం మన్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, పార్వతీపురంలో 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్)లో 2023–24 విద్యాసంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీలోగా ఎలాంటి అపరాధ రుసుం చెల్లించకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 27 నుంచి 30వ తేదీవరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. అర్హత గల అభ్యర్థులు వెంటనే డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని దగ్గరలో గల ఓపెన్ స్కూల్ సెంటర్‌లో ఒరిజినల్ సర్టిఫికేట్‌లు సమర్పించాలన్నారు. అనంతరం ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని కోరారు.

పంట పొలాల్లో గజరాజులు



ఏనుగుల ధ్వంసం చేసిన పామాయిల్, అరటి మొక్కలు చూపిస్తున్న విశ్రాంత ఆర్మీ ఉద్యోగి

కొమరాడ: గజరాజుల గుంపు సంచారంతో పంటలు నాశనమవుతున్నాయని, నష్టం వాటిల్లుతోందని రైతులు గగ్గోలుపెడుతున్నారు. కొమరాడ మండలంలోని మాదలింగి గ్రామంలో ఏడు ఏనుగుల గుంపు వారం రోజులుగా సంచరిస్తోంది. పొలాలకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. మాదలింగి గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి శిష్టు మహేష్ సాగుచేసిన పామాయిల్, అరటి పంటలను సోమవారం ధ్వంసం చేశాయి. పామాయిల్ మొక్కలతో సహా పీకిపడేశాయని ఆయన వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేపు సాలూరులో జగనన్నకు చెబుదాం

సాలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధ్యక్షతన బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పార్వతి తెలిపారు. అర్జీదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీ-20 మ్యాచ్ స్కోరర్‌గా తోట విజయ్

విజయనగరం: విశాఖ వేదికగా జరగనున్న అంతర్జాతీయ టి-20 క్రికెట్ మ్యాచ్‌కు స్కోరర్‌గా విజయనగరానికి చెందిన బీసీసీఐ స్కోరర్ తోట విజయ్ నియామకమయ్యారు. ఈ నెల 23న భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య విశాఖపట్నంలోని డా.వైస్సార్ ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. దీనికి విజయ్‌ను అధికారిక స్కోరర్‌గా నియమిస్తూ ఆంధ్రా క్రికెట్ సంఘం కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

కార్తీక వైభవం

ముక్కంటేశ్వరునికి ప్రీతికరమైన కార్తీక సోమవారం జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లాయి. శివునికి అభిషేకాలు చేసేందుకు వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. రోజంతా శివనామస్మరణలో తరించారు. పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మారేడుపత్రాలతో అర్చనలు జరిపారు. ఆధ్యాత్మిక చింతనతో గడిపి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



తోణాం శివాలయంలో దీపారాధన



పంచముఖేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు



సాలూరు పంచముఖేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



భామిని: మల్లిఖార్జునుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు



పార్వతీపురంటౌన్: బెలగాంలోని పశుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయంలో భక్తుల సందడి

ఇంటర్మీడియట్ విద్యతో...

ఐటీ కొలువు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ఇంటర్మీడియట్‌లో 75 శాతం మార్కులు పొందిన వారికి ఉద్యోగాలు
- హెచ్‌సీఎల్‌టెక్–బి, ఇంటర్‌బోర్డు సంయుక్తంగా ప్రణాళికలు
- విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన సదస్సులు
- కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- భాగస్వాములైన జిల్లాలో అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ విద్య చదివిన వెంటనే ఐటీ కొలువు సాకారమైతే.. అబ్బో ఇంతకంటే ఏం కావాలి అనుకుంటున్నారా?... ఇది నిజమే. ఇంటర్మీడియట్‌లో 75 శాతం మార్కులు సాధించే వారికి ఐటీకొలువులు కల్పించే బాధ్యతను జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం భుజానవేసుకుంది. యుక్త వయసులోనే ఐటీ కొలువుల్లో రాణించే అవకాశాలను అక్కరకు తెస్తోంది. చదువులో ప్రతిభచూపే విద్యార్థులకు చిన్నవయసులోనే ఉద్యోగాలు కల్పించేలా సాఫ్ట్‌వేర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంటోంది. రాష్ట్రంలో చదువుకున్న ప్రతి విద్యార్థి ప్రయోజకుడిగా ఎదగాలన్నదే లక్ష్యంగా విద్యాసంస్కరణలు అమలుచేస్తోంది. సంప్రదాయ కోర్సులకు బదులు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన, ఉపాధినిచ్చే కోర్సులను ప్రోత్సహిస్తోంది.

ఉద్యోగం+చదువు

విద్యార్థులకు రెండు విభాగాల్లో ఉద్యోగాలు కల్పిస్తారు. ఇంటర్‌లో ఐటీ సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన వారికి అడ్మినిస్ట్రేటివ్‌కు సంబంధించి డీపీఓ విభాగంలో ఉద్యోగాలు ఇస్తారు. ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ చదివిన విద్యార్థులు ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రణాళిక రూపొందించారు. దీని కోసం బిట్స్‌పిలానీ, శస్త్ర, ఎమిటీ, ఐఐఎం నాగ్పూర్, కే.ఎల్. యూనివర్సిటీలతో ఒప్పందాలు చేసుకున్నారు. వీటిలో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల ఫీజులో కొంతమొత్తాన్ని హెచ్‌సీఎల్ కంపెనీ చెల్లించనుంది. రూ.15 వేలు ఏటా ఫీజును కంపెనీ భరించేలా చర్యలు చేపట్టారు.

కుదిరిన ఒప్పందం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అన్ని గ్రూపుల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా హెచ్‌సీఎల్, టెక్–బి కంపెనీతో ఇంటర్మీడియట్ బోర్డు ఒప్పందం కుదుర్చుకుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 2022లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైనవారు, 2024 విద్యాసంవత్సరంలో సెకెండియర్ పరీక్షలు రాయనున్నవారు అర్హులు. ఆయా విద్యార్థులందరూ ఈ నెలాఖరు నాటికి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. విద్యార్థులకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుంది. మొదట క్యాట్ ఎగ్జామ్, తర్వాత ఇంగ్లిష్ నైపుణ్య పరీక్ష, చివరిగా ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ మూడింటిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఏడాదిపాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేల స్టైఫండ్ అందజేస్తారు. శిక్షణ పూర్తయిన వారికి మంచి వేతనంతో కూడిన ఉద్యోగం లభిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కంపెనీ ప్రతినిధులతో కలిసి, జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. నవంబర్ నెలాఖరు నాటికి ఆసక్తి కలిగిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. రిజిస్ట్రేషన్ల గడువుకు సమయం తక్కువగా ఉంది. జూనియర్ కళాశాలల యాజమాన్యాలు చొరవచూపి ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి. – మంజులావీణ, జిల్లా వృత్తి విద్యాధికారిణి, పార్వతీపురం మన్యం

మంచి అవకాశం



ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి, సంయుక్త సంచాలకుల సూచనల మేరకు జిల్లాలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాం. 75 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన అన్ని గ్రూపుల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పొందగలిగేలా హెచ్‌సీఎల్, టెక్–బి కంపెనీతో ఇంటర్మీడియట్ బోర్డు ఎంఓయూ కుదుర్చుకుంది. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేకూరనుంది. – మజ్జి ఆదినారాయణ, ఆర్ఐఓ, ఉమ్మడి విజయనగరం జిల్లా

ఇంటింటా సంక్షేమం

సొంతిల్లు ఉంది



మేము నిరుపేదలం. కూలిచేస్తేగాని కూడు దొరకనిపరిస్థితి. ఇంటి స్థలం కొనుగోలుచేసి కొట్టుకునే స్థోమత లేదు. గతంలో చాలామంది నాయకులను కలిసి ఇంటిస్థలం ఇప్పించాలని వేడుకున్నాం. ఎవరూ కనికరించలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వలంటీరే మా ఇంటికి వచ్చి ఇంటి దరఖాస్తు పెట్టించారు. పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.లక్షా80వేలు, రాయితీపై నిర్మాణ సామగ్రిని ప్రభుత్వం సమకూర్చింది. ఇప్పుడు మాకు సొంతిల్లు ఉందని సగర్వంగా చెప్పుకోగలుగుతున్నాం. జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరచిపోలేనిది.
– పొన్నాడ లక్ష్మి, ఆర్తమూరు గ్రామం, గరివిడి మండలం

కష్టాలు తొలగాయి



గతంలో మా ఊరి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కూర్చొనేందుకు బెంచీలు ఉండేవి కావు. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు అరకొరే. విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు నాడు–నేడు పనుల కింద పాఠశాలను బాగుచేశారు. బెంచీలు, మరుగుదొడ్లు, టైల్స్‌తో కూడిన గచ్చులు, తాగునీటి సదుపాయం, తరగతి గదుల్లో గ్రీన్ చాక్‌బోర్డులు, ఫ్యాన్‌లు ఇలా... పాఠశాలకు కావాల్సిన సదుపాయాలన్నీ కల్పించారు. విద్యార్థులను ఆకర్షించేలా తీర్చిదిద్దారు. పాఠశాలను చూస్తే ముచ్చటేస్తోంది. మా ఇద్దరి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చక్కగా చదువుకుంటున్నారు. పేదకుటుంబాల పిల్లలు చదువుకునే పాఠశాలలకు సదుపాయాలు కల్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. – కె.శ్యామల, ఆర్తమూరు గ్రామం, గరివిడి మండలం

ఆదుకున్న ఆరోగ్యశ్రీ



నేను రెండేళ్ల కిందట నడవలేకపోయేవాడ్ని. నడిచేటప్పుడు రెండు మక్కలు తీవ్రమైన నొప్పి వచ్చేవి. విశాఖపట్నంలోని ఎముకల డాక్టర్‌కు చూపిస్తే ఆపరేషన్ చేయాలన్నారు. అతని ఆస్పత్రిలోనే చేరాను. ముందు కుడి వైపు మక్క(హిప్)కు ఆపరేషన్ చేశారు. మూడు నెలలు తర్వాత ఎడమవైపు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం కోలుకున్నాను. కొద్దికొద్దిగా నడవగలుగుతున్నాను. నొప్పి తగ్గింది. రెండు ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చేయించుకున్నాను. ఆరోగ్యశ్రీ పథకం వల్ల నాకు ఎటువంటి ఖర్చు లేకుండా ఆపరేషన్లు జరిగాయి. సీఎం జగన్‌మోహన్ రెడ్డి మేలును జీవితాంతం గుర్తించుకుంటాను.
– నెలివాడ ఈశ్వరావు, కొంపంగి, మెంటాడ మండలం

పుష్కలంగా సాగునీరు



నా పేరు శనపతి అప్పలనాయుడు. మాది విజయగనగరం జిల్లా, గజపతినగరం మండలం, పిడిశీల గ్రామం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చంపావతి నది నుంచి సాగునీరు అందేలా మా ప్రాంతంలోని 13 వంతుల కాలువను బాగుచేసింది. దీంతో సాగునీటి కష్టాలు తప్పాయి. పంటలు బాగా పండుతున్నాయి.

జీవన ఉన్నతికి 'ఆసరా'



నా పేరు దూడ కల్యాణి. మాది వీరఘట్టం మేజర్ పంచాయతీలోని సెగిడివీధి. నాతో పాటు మరో తొమ్మిది మంది కలిసి అంజలి స్వయంశక్తి సంఘంగా ఏర్పడ్డాం. నాలుగేళ్లగా వైఎస్సార్ ఆసరా కింద మా సంఘానికి రూ.4.50 లక్షల ఆర్థిక ప్రయోజనం కలిగింది. ఇందులో నా వాటాగా రూ.45 వేలు వచ్చింది. ఈ డబ్బుతో పాటు కొంత రుణం తీసుకుని పాన్‌షాపు నిర్వహిస్తున్నా. మాలాంటి వారిని ఆదుకుంటున్న జగనన్నకు రుణపడి ఉంటాం.

గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం ఎయిర్‌పోర్ట్

- విశాఖ నీతి అయాగ్ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లా అభివృద్ధికి భవిష్యత్తులో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం గ్రోత్ ఇంజిన్ కానుందని, రానున్న రోజుల్లో దీని కేంద్రంగానే అభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. నీతిఆయోగ్ ఆధ్వర్యంలో గ్రోత్ హబ్‌లపై విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన విశాఖ పరిసర ప్రాంత కలెక్టర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని అభివృద్ధి అవకాశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విశాఖను గ్రోత్ హబ్‌గా రూపొందించాలని నీతిఆయోగ్ నిర్ణయించిన నేపథ్యంలో విశాఖ పరిసర ప్రాంత ఎనిమిది జిల్లాల కలెక్టర్లతో నీతిఆయోగ్ అధికారులు ఆయా జిల్లాల్లో వృద్ధికి గల అవకాశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి అవకాశాలను వివరించారు. ఉద్యాన పంటలను విస్తరించడం, ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటును, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా మరిన్ని ఉద్యోగాలు కల్పించవచ్చన్నారు. జిల్లాలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రమం ఏర్పాటవుతున్న నేపథ్యంలో స్థిరాస్థి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు తగిన చర్యలు చేపట్టడం ద్వారా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు పెంపొందించడంతోపాటు ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తుందని వివరించారు. గత ఏడేళ్ల కాలంలో వ్యవసాయ, పశుసంవర్థక, ఉద్యాన, సేవల, స్థిరాస్థి, నిర్మాణ రంగాల్లో జిల్లా సాధించిన అభివృద్ధిని గణాంకాలతో వివరించారు. ఆయా రంగాల్లో వృద్ధి సాధించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను తెలియజేవారు. సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ, నీతి అయాగ్ అదనపు కార్యదర్శి అన్నారాయ్, నీతిఆయోగ్ సలహాదారు పార్థసారథి రెడ్డి, మెకన్సీ కంపెనీ ప్రతినిధి అభిలాష్, ప్రణాళిక శాఖ కార్యదర్శి గిరిజా శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గంగపుత్రులకు

జీవన భరోసా



- మత్స్యకారుల సంక్షేమానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి
- వేట విరామ సమయంలో మత్స్యకార భరోసా
- నాణ్యమైన ఉత్పత్తుల విక్రయానికి ఫిష్ ఆంధ్రా యూనిట్లు
- నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గంగపుత్రుల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషిచేస్తోంది. వివిధ సంక్షేమ పథకాల కింద మత్స్యకారులకు సాయం చేస్తోంది. నాలుగున్నరేళ్లలో రాష్ట్ర బడ్జెట్‌లో మెరుగైన రీతిలో నిధులు కేటాయించింది. ఓ వైపు చేపల వేటను ప్రోత్సహిస్తూ మంచి జీవనోపాధి కల్పించడంతోపాటు, నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను వినియోగదారులకు అందించేందుకు చర్యలు చేపట్టింది. పూసపాటిరేగ మండలం చింతపల్లి వద్ద సుమారు రూ.23.74 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ యూనిట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇటీవల భూమిపూజ కూడా చేశారు. నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

వైఎస్సార్ మత్స్యకార భరోసా...

ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకూ చేపల వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకారులకు ఉపశమనం కలిగించేందుకు అర్హులందరికీ వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకాన్ని వర్తింపజేస్తోంది. ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.4 వేలు మాత్రమే ఇచ్చేవారు.

ఆయిల్ సబ్సిడీ...

మత్స్యకారుల మర పడవలకు డీజిల్‌పై సబ్సిడీని రూ.6.03 పైసల నుంచి రూ.9కి పెంచింది. దీనివల్ల జిల్లాలో 666 మెకనైజ్డ్ బోట్ యజమానులు ఏటా సుమారు రూ.1.80 కోట్ల వరకూ ప్రయోజనం పొందుతున్నారు.

మత్స్యకారులకు పరిహారం పెంపు...

సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు ఎవరైనా ప్రమాదవశాత్తూ మరణిస్తే, వారి కుటుంబాలు వీధిన పడకుండా ఆదుకొనేందుకు పరిహారాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచింది. గత ప్రభుత్వ హయాంలో రూ. 5 లక్షలు మాత్రమే ఉండేది.

జీవనోపాధి కోసం పింఛన్లు

50 ఏళ్లు పైబడిన మత్స్యకారులకు ప్రభుత్వం పింఛన్ అందజేస్తోంది. జిల్లాలో 2,227 మంది మత్స్యకారులకు రూ.2,750 చొప్పున ప్రతినెలా చేతికందుతోంది.

కిసాన్ క్రెడిట్ కార్డులు

సముద్ర, స్వదేశీ మత్స్యకారులకు ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డులను మంజూరు చేస్తోంది. వీటి ద్వారా ఆక్వా రైతులు, చేపల వ్యాపారులు, మత్స్యకార మహిళా సహకార సంఘాల సభ్యులు అతి తక్కువ వడ్డీ రేటుకే రుణాలు పొందే అవకాశం కల్పించింది. జిల్లాలో 2020–21 నుంచి ఇప్పటివరకు రూ. 38 లక్షల విలువైన 181 కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరయ్యాయి.

మత్స్య సాగుబడి...

చేపల ఉత్పత్తి పెంపు, మేలైన రకాల ద్వారా అధిక లాభం పొందేలా మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మత్స్య సాగుబడి పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వారికి అవసరమయ్యే సాంకేతిక సహకారాన్నీ అందిస్తోంది.

ఆక్వా ల్యాబ్ సేవలు...

ఆక్వాకల్చర్‌లో నకిలీలను నియంత్రించేందుకు, విజయనగరంలో ఇప్పటికే ఉన్న ఒక ఆక్వా ల్యాబ్‌ను మరింత ఆధునీకరించారు. ఆక్వా కల్చర్ రైతులకు ఇన్‌పుట్ టెస్టింగ్ సౌకర్యాలు కల్పించడానికి, సాంకేతిక సేవలను అందించడానికి, జిల్లా నుంచి మత్స్య ఎగుమతులను పెంచడానికి ఇది ఎంతగానో దోహదపడుతోంది.

మత్స్య సంపద యోజన

మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన' పథకాన్ని ప్రవేశపెట్టింది. 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాల్లో జిల్లాకు సుమారు రూ.11.77 కోట్లను కేటాయించింది. మత్స్యకారులకు అవసరమైన పరికరాలు, ద్విచక్ర వాహనాలను ఈ పథకంలో పంపిణీ చేస్తున్నారు. ఆక్వా హబ్‌లు, లాంజ్‌లు ఏర్పాటు, లైవ్ ఫిష్ తరలింపు వాహనాల పంపిణీ, విక్రయ కేంద్రాలు, కియోస్క్‌లు, ఫింగర్ లింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర కార్యక్రమాలను చేపడుతున్నారు.

ఆక్వా హబ్‌లు..

సాంప్రదాయ మత్స్యకారుల ఆర్థిక స్థితి, పోషకాహార భద్రత, పరిశుభ్రతను పెంపొందించడమే లక్ష్యంగా ఒక్కొక్కటీ రూ.కోటి వ్యయంతో ఆక్వా హబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. జిల్లాకు మూడు కేటాయించింది. ప్రస్తుతం రేగిడి మండలం సంకిలి వద్ద ఒక యూనిట్ నిర్మాణంలో ఉంది.

ఫిష్ ఆంధ్రా యూనిట్లు...

నాణ్యమైన చేపలను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ఫిష్ ఆంధ్రా యూనిట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఒక్కో యూనిట్ ఖరీదు రూ.1.75 లక్షలు కాగా ఎస్సీలు, ఎస్టీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఇస్తోంది.

నేడు ప్రత్యేక కార్యక్రమం...

ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంగళవారం మత్స్యకారులకు వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లాంఛనంగా ప్రారంభిస్తారు. జిల్లాలో 32 మంది మత్స్యకారులకు ఒక్కొక్కటీ రూ.75వేల విలువైన ద్విచక్ర వాహనాలు, రూ.60 లక్షల విలువైన మూడు లైవ్ ఫిష్ రవాణా వాహనాలను పంపిణీ చేయనున్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం


కాలిపోతున్న పూరిల్లు

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో పంట అప్పలనర్సమ్మ పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న ధాన్యం, బియ్యం, కొంత నగదు, వంట సామగ్రి కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.20 వేల వరకు ఆస్తినష్టం జరిగింది. ప్రమాదాన్ని స్థానికులు గమనించి మంటలను అదుపు చేశారు. విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ మిడితాన కల్యాణి, సచివాలయ సిబ్బంది వెళ్లి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వపరంగా రావాల్సిన సహాయాన్ని అందిస్తామని బాధిత మహిళకు హామీ ఇచ్చారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగమేష్

పార్వతీపురంటౌన్: గరుగుబిల్లి మండలంలోని ఉద్దవోలు గ్రామానికి చెందిన కె.సంగమేష్ మద్యం తాగవద్దని భార్య మందలించినందుకు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బతుకు తెరువుకోసం వచ్చి విజయనగరంలోని బాబామెట్టలో సంగమేష్ కూలిపని చేసుకుంటున్నాడు. వీరఘట్టం మండలంలోని తలవరం అత్తవారింటికి ఇల్లు చూపుల కోసం భార్యాపిల్లలతో కలిసి ఆదివారం వెళ్లాడు. ఈ సందర్భంగా మందు తాగవద్దని భార్య చెప్పడంతో మనస్తాపానికి గురై పార్వతీపురంలో గడ్డిమందు కొనుక్కుని ఉల్లిభద్రలో మద్యంలో గడ్డిమందు కలిపి తాగాడు. ఈ విషయాన్ని స్నేహితులకు ఫోన్‌లో సంగమేష్ తెలియజేయగా చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి బైక్‌పై తరలించారు. ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బొగ్గు లారీ బోల్తా


బోల్తాపడిన బొగ్గులారీ

గరుగుబిల్లి: పార్వతీపురం–శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలో చిలకాం గ్రామ మలుపువద్ద సోమవారం ఉదయం బొగ్గును తరలించే లారీ అదుపు తప్పి బోల్తా పడింది. వీరఘట్టం నుంచి పార్వతీపురం వైపు వస్తున్న బొగ్గులారీ చిలకాం బస్‌షెల్టర్ సమీపంలో అదుపు తప్పి పడిపోవడంతో లారీలో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు పెనుప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కారు ఢీకొని 17 గొర్రెల మృతి

- గాయాలపాలైన మరో 30 గొర్రెలు
- లబోదిబోమంటున్న కాపరులు


మృతిచెందిన గొర్రెలు

లక్కవరపుకోట: మండలంలోని అరకు–విశాఖపట్నం అంతర్‌రాష్ట్ర రహదారిలో సోంపురం జంక్షన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున కారు ఢీకొని 17 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా మరో 30 గొర్రెలు తీవ్ర గాయాల పాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి గొర్రెల కాపరులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శృంగవరపుకోట మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన వారాది అప్పిలి, వారాది బంగారయ్య, బొబ్బిలి గోవింద, శ్రీనులు కొద్ది కాలం క్రితం సుమారు 3 వందల గొర్రెల మందను మేపు కోసం అనకాపల్లి జిల్లా సమీపంలోకి తీసుకెళ్లారు. సీజన్ ముగియడంతో స్వగ్రామానికి మందను తోలుకొస్తుండగా ఆదివారం రాత్రి సోంపురం జంక్షన్ సమీపంలో గల ఖాళీ స్థలంలో బసచేశారు. అక్కడి నుంచి తెల్లవారుజామున స్వగ్రామానికి బయల్దేరే క్రమంలో వెనుకనుంచి మితిమీరిన వేగంతో వచ్చిన కారు మందను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఢీకొట్టిన కారు అక్కడి నుంచి వేగంగా పరారైనట్లు కాపరులు తెలిపారు. గాయపడిన గొర్రెలకు ఎల్.కోట పశువైద్యాధికారిణి గాయత్రిదేవి వైద్యసేవలు అందించారు. ఈ ప్రమాదంపై ఎల్.కోట పోలీస్‌స్టేషన్‌లో గొర్రెల కాపరులు ఫిర్యాదు చేశారు.

పూర్తిస్థాయిలో వినతుల పరిష్కారం

- జేసీ గోవిందరావు


వినతులను స్వీకరిస్తున్న జేసీ గోవిందరావు


పార్వతీపురం టౌన్: అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఈఈ సింహాచలం

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతు లను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, కేఆర్‌సీపీ డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడులు ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక అంశాలపై 152 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని శాఖలవారీగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ తదితరులున్నారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్: బాధితుల ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని పరిశీలించారు. వేధింపులు, కుటుంబకలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసు స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప కిరణ్, ట్రైనీ డీఎస్పీ ఎస్ఎం.డి అజీజ్, ఎస్‌బీ సీఐ, సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ ఎన్.వి. ప్రభాకర్ రావు, టౌన్ సీఐ కృష్ణారావు, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 33 వినతులు

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 33 వినతులు వచ్చాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం వినతులు స్వీకరించారు. స్పందనలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేయాలి

- జేసీ మయూర్ అశోక్


విజయనగరం అర్బన్: అర్జీలు స్వీకరిస్తున్న జేసీ మయూర్ అశోక్, జిల్లా అధికారులు


విజయనగరం క్రైమ్: బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం అర్బన్: జిల్లాలో అర్హులైన యువతను ఓటర్లుగా చేర్పించడంపై మండల ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. ముఖ్యంగా కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ ఓటర్లుగా నమోదయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్స్ నుంచి విద్యార్థుల జాబితాలు సేకరించి వారిలో ఎంతమంది ఓటరుగా నమోదు చేసుకున్నదీ ఆరా తీసి ఓటరుగా నమోదు కాని వారందరినీ ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని జేసీ మయూర్ అశోక్ చేపట్టారు. జేసీతోపాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత, రెవెన్యూ డివిజన్ అధికారి ఎంవీసూర్యకళ, డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శనదొర, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల తదితరులు వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం అర్జీలను పంపించారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా గ్రీవెన్స్‌లో అర్జీలు అందించారు. కార్యక్రమంలో మొత్తం 241 వినతులు అందాయి.

స్పందన ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులకు సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల నుంచి 31 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, చట్టపరిధిలో న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చర్యలను ఏడు పనిదినాల్లో పరిష్కరించేలా చర్యలు చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఇ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన 'ఉపాధి' రికవరీలు

- సిబ్బంది నుంచి వసూలు చేయాల్సిన సొమ్ము రూ.2.60 కోట్లు
- ఇప్పటివరకు చేసింది రూ.1.68 కోట్లు


ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గాయి. పథకం రాకముందు హైదరాబాద్, చైన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు పనుల కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు వెళ్లేవారు. పథకం వచ్చిన తర్వాత ఉన్న ఊరిలో పనులు లభించడంతో గ్రామాల్లోనే పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే కొంత మంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే సోషల్ ఆడిట్ (సామాజిక తనిఖీ)లో ఉపాధి సిబ్బంది ఎంతమేర అక్రమాలకు పాల్పడ్డారన్నది బృందం సభ్యులు గుర్తిస్తారు. మండల స్థాయిలో నిర్వహించే సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆ వివరాలు అధికారులకు అందజేస్తారు. మండలాల్లో సామాజిక తనిఖీ ప్రజావేదికసభలు అయిన తర్వాత జిల్లాస్థాయిలో చివరిగా నిర్వహిస్తారు. సోషల్ ఆడిట్ సిబ్బంది ఎవరెవరి నుంచి ఎంత రికవరీ చేయాలన్న వివరాలు డ్వామా అధికారులకు అందజేస్తారు. వాటి ఆధారంగా సిబ్బంది నుంచి డ్వామా అధికారులు రికవరీ చేస్తారు.

2.60 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది:

ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్స్) సాంకేతిక సహాయకులు (టెక్నికల్ అసిస్టెంట్స్) ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ (ఈసీ), కంప్యూటర్ ఆపరేటర్స్, ఏపీఓలు క్షేత్రస్థాయిలో పనిచేస్తుంటారు. సోషల్ ఆడిట్ సిబ్బంది రికవరీకి సూచించింది కూడా ఈ క్యాడర్ల వారినే. జిల్లా వ్యాప్తంగా రూ.2.60 కోట్లు రికవరీ చేయాలని వారు సూచించారు. వారి నుంచి రూ. 1.68 కోట్లు ఇప్పటివరకు రికవరీ చేశారు. ఆర్‌ఆర్‌యాక్ట్ కింద రూ.88.50 లక్షల రికవరీ పెండింగ్‌లో ఉంది. ఇది కాక సిబ్బంది నుంచి రూ.1.97 లక్షలు రికవరీ చేయాల్సి ఉంది.

జీతాల నుంచి రికవరీ

ఉపాధి హామీ సిబ్బంది కట్టాల్సిన సొమ్మును వారి జీతాల నుంచి అధికారులు రికవరీ చేస్తున్నారు. ఇప్పటికే డ్వామా అధికారులు సిబ్బంది నుంచి చాలావరకు రికవరీ చేశారు. ఒక వేళ కట్టాల్సిన సొమ్ము ఎవరైనా కట్టకపోయినట్లయితే వారికి కొనసాగింపు ఉత్తర్వులు నిలిపివేస్తారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే సిబ్బందికి ఏటా కొనసాగింపు ఉత్తర్వులు ఇస్తారు.

రికవరీకి చర్యలు

ఉపాధి నిధులు శతశాతం రికవరీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. రూ.2.60 కోట్లు రికవరీ చేయాల్సి ఉండగా ఇప్పటికే చాలా వరకు చేశా. మిగతాది కూడా వసూలు చేస్తాం.
– జి.ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్ల సత్తా


బాలికల జట్టు


బాలుర జట్టు

- ప్రథమస్థానంలో నిలిచిన బాలురు, బాలికలు

బొబ్బిలి: గుంటూరు జిల్లా వెలిగండ్లలో ఈనెల 18,19,20 తేదీల్లో జరిగిన అండర్ –14 రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో విజయనగరం జిల్లా బాలికలు, బాలుర జట్లు ప్రథమ స్థానం సాధించినట్లు కోచ్, మేనేజర్‌లు సత్యనారాయణ, అప్పలనాయుడులు తెలిపారు. గెలుపొందిన జట్లు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. జిల్లా జట్లలో 11 మంది బొబ్బిలి మండలం పారాదిలోని జెడ్పీఉన్నత పాఠశాల క్రీడాకారులేనని పీడీ ఎస్ వెంకటనాయుడు తెలిపారు. జయశ్రీ,మాన్విత, నాని, మోహన్ సాయి, పవన్‌లు పారాదిలో చదువుతున్నారని, మిగతా వారు ఆరికతోట పాఠశాలలో చదువుతున్నారన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికవడం పట్ల పారాది హెచ్ఎం నాగేశ్వరరావు అభినందించారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కొప్పెర్ల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 15,16,17 తేదీలలో కర్నూలు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా తరపున ఆడి విజేతలుగా నిలవడంతో పాఠశాలకు చెందిన అజయ్‌కుమార్, ఎ.రాజు, బి.శ్రావణ్‌కుమార్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాగా ఢిల్లీలో జరగబోయే జాతీయ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొననున్నారు. పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికకావడంతో ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరరావు, వైస్‌ప్రిన్సిపాల్ రఘురామనాయుడు, పీడీ కృష్ణ, పీఈటీ సత్యనారాయణతో పాటు ఇతర ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు జీసీఎస్ఆర్ విద్యార్థినులు


సౌత్‌జోన్ ఇంటర్‌యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

రాజాం సిటీ: ఈ నెల 22 నుంచి 25 వరకు తమిళనాడు రాష్ట్రంలోని అలగప్ప యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్‌యూనివర్సిటీ మహిళల కబడ్డీ పోటీలకు స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారని పీడీ చీకటి కేశవనారాయణ సోమవారం తెలిపారు. ఇటీవల అంబేడ్కర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పొందూరులో జరిగిన పోటీల్లో కళాశాలకు చెందిన ఎస్.అమృత, బి.భవాని ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారన్నారు. వారి ఎంపికపట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తమరావుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక


ఆర్చరీలో తలపడుతున్న విద్యార్థులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ నెల 23 నుంచి విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరగనుండడంతో ఇక్కడ 26 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వాలీబాల్, ఆర్చరీ, జావెలిన్‌త్రోలో క్రీడాకారులకు పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో డిప్యూటీఈవో ఎ.లిల్లీరాణి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, ఏఎంవో కోటిబాబు, సూపరింటెండెంట్ దేశ్, వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం జిల్లా సెక్రటరీ రాజేంద్ర, పీడీలు ఆర్‌సీ రెడ్డి, ఎంవీరమణ, బీవీ రమణ, వీపీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


నూతన పుస్తకాలను ఆవిష్కరించిన వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

- జేఎన్‌టీయూ జీవీ లైబ్రరీలో 364 కొత్తపుస్తకాల ఆవిష్కరణ

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ప్రాంగణంలో డాక్టర్ వైఎస్సార్ సెంట్రల్ లైబ్రరీలో 364 కొత్తపుస్తకాలను వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య సోమవారం ఆవిష్కరించారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రస్తుతం లైబ్రరీలో ఉన్న 24,907 వాల్యూమ్‌లకు కొత్త పుస్తకాలను అనుసంధానం చేసినట్లు వీసీ తెలిపారు. డెల్‌నెట్ ఆన్‌లైన్ జర్నల్స్, ఈ–బుక్స్, ఐఈఈఈ ఆన్‌లైన్ జర్నల్స్, మ్యాగజైన్స్, న్యూస్‌పేపర్స్, డిజిటల్ లైబ్రరీలో 10 కంప్యూటర్ సిస్టమ్స్ అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం బీటెక్ ఆర్23 రెగ్యులేషన్స్ కోసం, జనరల్, గేట్, ఇతర పోటీ పరీక్షల పుస్తకాలను కొత్త పుస్తకాలతో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. దీనివల్ల ఇంజినీరింగ్ విద్యార్థులకు లైబ్రరీ పఠనంపై ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గురునాథ, ఆఫీసర్ ఇన్‌చార్జ్ లైబ్రరీ డాక్టర్ చింతానీలిమాదేవి, లైబ్రరీ అసిస్టెంట్ జి.ఈశ్వరరావు వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు లక్ష్యం పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

- వేగవంతంగా ఇళ్ల నిర్మాణం
- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ప్రయారిటీ భవనాల కోసం వారం వారం లక్ష్యాలను నిర్దేశించామని ఇకపై ఏ వారం లక్ష్యం ఆ వారమే పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. జిల్లాకు 3 రకాల భవనాలు కలిపి వారానికి 57 భవనాలను లక్ష్యంగా నిర్దేశించామని, వాటిని ఎప్పటికప్పుడు పూర్తి చేయకపోతే గత వారం పెండింగ్ కలిపి పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా అధికారులు, మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రత్యేకాధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రయారిటీ భవనాలను డిసెంబర్ 10లోగా పూర్తి చేయాల్సి ఉందని, అందుకోసమే వారం వారం లక్ష్యాలను నిర్దేశించామని తెలిపారు. హౌసింగ్ డే ఉత్సవాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. వేగంగా ప్రారంభించకపోతే ప్రారంభం కాని గృహాలను రద్దు చేస్తామన్నారు. లేఅవుట్లలో నీటి సరఫరా, విద్యుత్ సరఫరా వెంటనే ఏర్పాటు చేయాలని, సోక్ పిట్స్, ఐఎస్ఎల్ లక్ష్యాలను కూడా కాలనీలలో పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పని దినాలను హౌసింగ్ పథకం ద్వారా పూర్తి చేయాలని సూచించారు.

ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పూర్తయినప్పటికీ రిఫర్ చేసిన వారికీ సర్జరీలు, తదుపరి వైద్యం అన్నీ ఉచితంగా అందించేది? లేనిదీ? పరిశీలించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి రిఫర్ చేసిన వారందరికీ ఆపరేషన్లు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. ఆశ కార్యకర్తల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య శ్రీ యాప్ ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ కింద ఎంతమందికి ఐడీ లాగిన్‌లు వచ్చాయో వారందరితో ఈకేవైసీ చేయించాలని వారి వివరాలను వలంటీర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, పంచాయతీ రాజ్ ఈఈ గుప్తా, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ సీఈఓ రాజ్‌కుమార్, జీఎస్‌డబ్ల్యూ కోఆర్డినేటర్ నిర్మలాదేవి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, సబ్‌కలెక్టర్లు వెంకటేశ్వరరావు, దొర, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధికి పుష్కలంగా అవకాశం



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఆర్థిక అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. నీతి ఆయోగ్ స్పెషల్ సెక్రెటరీ అనారాయ్, స్టేట్ ట్యాక్స్ కమిషనర్ గిరిజా శంకర్‌లు విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ మీటింగ్ హాల్ నుంచి సోమవారం నిర్వహించిన నీతి ఆయోగ్ జి.హబ్ ప్రాంతీయ సమావేశానికి కలెక్టర్ నిశాంత్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు. సమావేశంలో ఆయన జిల్లా అభివృద్ధి అవకాశాల నివేదికను తెలియజేస్తూ పార్వతీపురం మన్యం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన భూమి, నీరు, మానవవనరులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఉన్నాయని, ధాన్యం దిగుబడికి ప్రసిద్ధిచెందినదని, 98 బియ్యం మిల్లులు ఉన్నాయన్నారు.

పారిశ్రామికంగా అభివృద్ధికి అవకాశాలు

పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు జిల్లాలో చక్కని అవకాశాలు ఉన్నాయని, జిల్లాలో నిర్మితమవుతున్న జాతీయరహదారిని ఆనుకుని 1400 ఎకరాల విస్తీర్ణంలో రెండు పారిశ్రామిల వాడలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, మానవవనరులు తక్కువ ధరకే లభిస్తాయని, జిల్లాకు ఒడిశాతో సరిహద్దులున్నాయని, ఎగుమతి అవకాశాలున్నాయని చెప్పారు. విశాఖపట్నం ఓడరేవు, విజయనగరంలో నిర్మితమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, జాతీయ రహదారిపై జిల్లా నుంచి రవాణాకు అనుసంధానమవుతున్నాయని తెలిపారు. పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉందన్నారు. జిల్లాలో పర్యాటకం, ఎకోటూరిజం, సాంస్కృతిక టూరిజం అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలున్నాయని వివరించారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన వాటర్‌ఫాల్స్, సాగునీటి జలాశయాలు, దేవాలయాలు, వ్యూపాయింట్స్, పార్వతీపురంలో టూరిజం పార్క్, పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో గిరిజన సంఘాల ద్వారా అటవీ ఉత్పత్తులను తయారు చేసి, ఉత్పత్తులకు సొంత బ్రాండింగ్ ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన పసుపు దిగుబడిలో దేశంలో రెండవ స్థానంలో ఉన్నామని, జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటల ఆధారిత పరిశ్రమలు స్థాపించేందుకు ఎక్కువ అవకాశాలున్నాయన్నారు. రెండు తృణధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఓ వీర్రాజు, పరిశ్రమల అధికారి కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹90	₹150	₹160